అకాల వర్షం.. రైతుల పాట్లు

- దెబ్బతిన్న పంటలు
- తడిసిముద్దయిన పత్తి


నంబాలలో నేలమట్టమైన వరిపైరు

రెబ్బెన: పంటల దిగుబడులు చేతికందే సమయంలో కురిసిన అకాల వర్షాలు రైతన్నలను తీవ్రంగా దెబ్బతీశాయి. మండలంలో శుక్రవారం తెల్లవారుజాము కురిసిన వర్షంతో వరి, పత్తి, కంది పంటలకు నష్టం వాటిల్లింది. కోతకు సిద్ధంగా ఉన్న వరిపైరు నేలమట్టం కాగా, పత్తి తడిసి ముద్దయింది. వందలాది ఎకరాల్లో వరి, వేలాది ఎకరాల్లో పత్తి దెబ్బతిన్నాయి. ప్రస్తుతం పూత, పిందె దశలో ఉన్న కంది పంటలను అకాల వర్షాలు దెబ్బతీయనున్నాయి. వానకు పూత రాలిపోవడంతోపాటు పిందెకు కాయతొలిచే పురుగు ఆశించే ప్రమాదం ఉంది. నంబాల, నారాయణపూర్, రెబ్బెన, కొమురవెల్లి, పుంజుమేరగూడ, ఎడవెల్లి, నక్కలగూడ, కైరిగాం, కిష్టాపూర్, తక్కళ్లపల్లి ప్రాంతాల్లో యంత్రాల కొరతతో రైతులు వరికోతలు చేపట్టలేకపోయారు. అయితే అకాల వర్షం కారణంగా వరిపైరు నేలమట్టమై ధాన్యం రాలిపోయింది. దానికితోడు పొలాలన్నీ తడిగా మారడంతో మరో పదిరోజుల వరకు కోత కోసేందుకు అవకాశం లేకుండా పోయింది. దాంతో పంటలు మరింత దెబ్బతినే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. దెబ్బతిన్న పంటలపై సర్వే చేపట్టి ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతుల పాట్లు

కౌటాల: మండలంలో శుక్రవారం అకాల వర్షం కురిసింది. చేతికొచ్చిన వరిపంట తడవకుండా కవర్లు కప్పేందుకు రైతులు పాట్లు పడ్డారు. వరి పంటను కోసి పొల్లాలోనే కుప్పలు వేశారు. వర్షం కురవడంతో నానా తంటాలు పడ్డారు. చాలామంది పంటలను కల్లలోనే ఉంచారు. వానకు పత్తి తడిసి ముద్దయింది.

చింతలమానెపల్లి: మండలంలో శుక్రవారం కురిసిన అకాల వర్షంతో రైతులు వరికుప్పలపై టార్పాలిన్లు, కవర్లను కప్పారు. వర్షాలకు కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట, పత్తి పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దహెగాం: మండలకేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో రైతులు ఆరబెట్టిన ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పారు. పత్తి తీత పనులు నిలిపివేశారు.

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలో శుక్రవారం ఎడతెరపి వర్షం కురిసింది. వర్షంతో జనజీవనం స్తంభించిపోయింది.


చింతలమానెపల్లి: వరి గడ్డపై కవర్లు కప్పుతున్న రైతు


రెబ్బెనలో తడిసిన పత్తి


వరి కుప్పపై కప్పి ఉంచిన కవర్ ఉన్న దృశ్యం

ఆశ్రమాల్లో కార్తీకశోభ


మోతుగూడ ఆశ్రమంలో భక్తుల పూజలు (ఫైల్)


బూర్గుడలోని బ్రహ్మనందగిరి ఆశ్రమం

- నేటి నుంచి మూడురోజులుగా వార్షికోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి

ఆసిఫాబాద్‌రూరల్: కార్తీకమాసం అంటేనే పూజలు, శుభకార్యాలు, వ్రతాలకు ప్రత్యేకం. ఈమాసంలో దీపాలు వెలిగించి పూజలు చేస్తే పుణ్యఫలం వస్తుందని భక్తుల విశ్వాసం. మండలంలోని ఆశ్రమాల్లో నేటి నుంచి మూడు రోజులపాటు కార్తీకపౌర్ణమి వార్షికోత్సవాలు జరగనున్నాయి. ఆశ్రమాలు, ఆలయాలు ముస్తాబయ్యాయి. భక్తుల కోసం అన్నిఏర్పాట్లు పూర్తిచేశారు. మోతుగూడ వేదాంత విచారణ ధ్యాన, బూర్గుడలోని బ్రహ్మనంద, బెల్గాంలోని కౌవల్య ఆశ్రమాల్లో జరిగే వార్షికోత్సవాలకు మొదటిరోజు సుప్రభాతసేవ, సాముహిక భగవద్గీత పారాయణ, ప్రణవ పతాకావిష్కరణ, నగర సంకీర్తన, గోమత, గురుదేవ పూజ, జ్యోతి ప్రజ్వలనతోపాటు రెండోరోజూ ఆధ్యాత్మిక ప్రవచనాలు, మూడోరోజు ఉదయం సుప్రభాతసేవ, హోమం, గీత యజ్ఞం కార్యక్రమం, మధ్యాహ్నం ఆధ్యాత్మిక మహాసభ, ఉపన్యాలు అనంతరం తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహిస్తారు. ఆశ్రమాల్లో ప్రతిఏటా జగద్గురువు బ్రహ్మనందగిరి స్వామిజీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధిస్తారు.

భక్తిమార్గం అలవర్చుకోవాలి



ప్రతిఒక్కరూ అధ్యాత్మికతతోపాటు భక్తిమార్గం అలవర్చుకోవాలి. మూడు రోజులుపాటు ఆశ్రమంలో బోధనలు, ప్రవచనాలు చేస్తాం. భగవద్గీతతోపాటు ఇతర బోధన నిర్వహిస్తాం.
– చిన్నయానందగిరి స్వామిజీ, పీఠాధిపతి

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

భీమారం: మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన పోటు మోహన్ రెడ్డికి చెందిన గేదె శుక్రవారం సాయంత్రం విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందింది. మేతకోసం వెళ్లిన గేదె తిరుగుప్రయాణంలో పంటపొలాల వద్ద గల కంచెకి సర్వీస్ వైర్ తాకడంతో దానికి విద్యుత్ ప్రవహించిందని, అదే సమయంలో గేదె తీగలకు తాకడంతో అది అక్కడికక్కడే మృతి చెందిందని గేదె యజమాని తెలిపారు. విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకొని నష్టపరిహారం చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బెంగాలీలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇప్పిస్తాం

- కేంద్రమంత్రి శంతన్ ఠాకూర్

కాగజ్‌నగర్‌రూరల్: బెంగాలీలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇప్పించేందుకు కృషి చేస్తామని కేంద్రమంత్రి శంతన్ ఠాకూర్ అన్నారు. మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.1లో శుక్రవారం జరిగిన బీజేపీ ఎన్నికల బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. బీజేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏర్పాటు ఖాయమన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో కమలం గెలుపు తథ్యమన్నారు. కేంద్రంలోని మోదీ సర్కార్ ఆధ్వర్యంలో అన్నిరంగాల్లో దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొంగ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఈర్ల విశ్వేశ్వర్‌రావు, మండల అధ్యక్షుడు వికాస్ గారామి, కార్యదర్శి గజ్జి ప్రసాద్, కాగజ్‌నగర్ పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్, పిర్సింగుల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత వాగ్దానాలు నమ్మొద్దు

- బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- గ్రామాల్లో ఎన్నికల ప్రచారం


ప్రవీణ్‌కుమార్‌కు బొట్టు పెడుతున్న మహిళ

దహెగాం: ఎన్నికల సమయంలో ఓట్ల కోసం కొందరు మోసపూరిత వాగ్దానాలు ఇస్తారని అవి నమ్మి మోసపోవద్దని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు, సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కోత్మీర్, రాళ్లగూడ, బీబ్రా, ఐనం, పెసరికుంట తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు సాధ్యం కాని హామీలు ఇచ్చి మోసం చేయడానికి ప్రయత్నం చేస్తున్నాయన్నారు. దేశంలో ప్రధాని మోదీ ఉన్నారని బీసీ కుల,గణన ఎందుకు చేయలేదన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకోని కల్వకుంట కుటుంబం వేల కోట్లు ప్రజాధనాన్ని లూటీ చేసిందని ఆరోపించారు. అందవెల్లి పెద్దవాగుపై వంతెన పనులు పూర్తి చేయడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. బీఎస్పీ మండల అధ్యక్షుడు దుర్గం దేవిదాస్, నాయకులు పిల్లల తిరుపతి, షాకీర్, ఎల్కరి ప్రశాంత్, గౌతం పాల్గొన్నారు.

బీఎస్పీని ఆశీర్వదించండి

పెంచికల్‌పేట్: ఈ ఎన్నికల్లో బీఎస్పీని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ప్రధాన రహదారి గుండా రోడ్‌షో నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మాయమాటలను నమ్మవద్దన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బిట్టి శ్రీనివాస్, నాయకులు షరీఫ్, దేవాజీ, ఆశన్న,బాబాజీ, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

బ్యాంక్‌సేవలు సద్వినియోగం చేసుకోవాలి

లింగాపూర్: బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని టీజీబీ మేనేజర్ ముకేశ్ కుమార్ కోరారు. మండలంలోని జాముల్‌ధర గ్రామంలో ఖాతాదారులు, ప్రజలకు శుక్రవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులు సక్రమంగా లావాదేవీలు నిర్వహించాలన్నారు. బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ మాన్సింగ్, ప్రజలు, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

చినుకుపడితే చీకటే..!

కౌటాల: కౌటాలలో శుక్రవారం ఉదయం చినుకులు పడ్డాయి. రోజంతా చలి గాలులు వీయడంతో ప్రజలు వణికిపోయారు. ఉదయం నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. 12 గంటల పాటు విద్యుత్ సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా ఈజ్‌గాం నుంచి సిర్పూర్(టి)లోని లోనవెల్లి వద్ద 33కేవీ లైన్ బ్రేక్ డౌన్ అయినట్లు ఏఈ రవీందర్ తెలిపారు. సిబ్బంది మరమ్మతు చేసి తిరిగి విద్యుత్‌ను సరఫరా చేశారు.

అలరించిన ఆర్ట్స్ డే


చిన్నారుల నృత్యాలు

కౌటాల: మండల కేంద్రంలోని ఇన్‌ఫంట్ జీసస్ ప్రైవేట్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఆర్ట్స్ డే వేడుకలు ఆలరించాయి. అంతకు ముందు విద్యార్థులు చేసిన నృత్యాలు, మిమిక్రీ పలువురిని ఆకట్టుకున్నాయి. ఫాదర్ టామ్ తోమస్, ఫాదర్ సతీశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో భక్తిభావం


శివాలయానికి వస్తున్న విద్యార్థులు


హారతిస్తున్న విద్యార్థులు

కెరమెరి: కార్తీకమాసం సందర్భంగా విద్యార్థుల్లో భక్తిభావం పెంపొందుతోంది. మండలంలోని నెహ్రూనగర్‌కు చెందిన సుమారు 30 మంది విద్యార్థులు ప్రతి 1.5 కి.మీ కాలినడకన కెరమెరిలోని శివాలయానికి వచ్చి ప్రతీరోజు కాగడ హారతిలో పాల్గొంటున్నారు. సాక్షి శుక్రవారం వారిని పలకరించగా.. భగవంతున్ని పూజించాలని అమ్మ, నాన్నా చెప్పారని తెలిపారు. ఉదయాన్నే శివాలయానికి చేరుకుని పూజలు చేస్తున్నామన్నారు.

భక్తిశ్రద్ధలతో కాగడహారతి

ఆసిఫాబాద్అర్బన్: పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని శ్రీ కేశవనాథ స్వామి ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో శుక్రవారం భక్తులు భక్తిశ్రద్ధలతో కాగడ హారతులు వెలిగించారు. అర్చకుడు ఒజ్జల నరేశ్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం చేశారు. అంతకుముందు ఉదయం పట్టణంలోని హారతులతో నగర సంకీర్తన చేశారు. ద్వాదశి సందర్భంగా శ్రీకృష్ణునికి గోపాలకాల ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


పాల్గొన్న భక్తులు

‘బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంల చీకటి కూటమిని ఓడించాలి’


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మనోహర్

రెబ్బెన(ఆసిఫాబాద్): బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంల చీకటి కూటమిని ఎన్నికల్లో ప్రజలు ఓడించాలని భారత్ బచావో రాష్ట్ర కమిటీ సభ్యుడు ఒడ్డెపల్లి మనోహర్, నియోజకవర్గ ఇన్‌చార్జి నీరేటి రాజన్న పిలుపునిచ్చారు. మండలంలోని గోలేటిలో శుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రసాధన కోసం విద్యార్థులు, యువకులు ప్రాణాలు అర్పించి తెలంగాణ సాధిస్తే అధికారం అందుకున్న కేసీఆర్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. కాళేశ్వరంలో భారీ అవినీతి జరిగిందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల్లో బీజేపీకి ఎంఐఎం పరోక్షంగా సహకరిస్తోందని ఆరోపించారు. నాయకులు రాజయ్య, లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు దుర్గం రవీందర్, కిషన్‌గౌడ్, బాలునాయక్, రమేశ్ పాల్గొన్నారు.

రాజ్యాంగంపై వ్యాసరచన పోటీలు

కాసిపేట: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎం21 (21వ శతాబ్ద బహుజన ఉద్యమం) ఆధ్వర్యంలో రాజ్యాంగంపై అవగాహన, ఓటుహక్కు విషయంపై ఇంటర్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో జూనియర్ కళాశాలతో పాటు మోడల్ స్కూల్ ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం21 మండల ఇన్‌చార్జి పల్లె మల్లయ్య మాట్లాడుతూ.. అంబేద్కర్ దేశంలోని ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం కల్పించేందుకు రచించిన రాజ్యాంగంలో పౌరుల విధులు, బాధ్యతలు, హక్కుల విషయమై అవగాహన కల్పించేందుకు ఎం21 పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కాలేజీ ఆవరణలో శనివారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీందర్, ఎం21 జిల్లా ఆపరేషన్ టీం సభ్యుడు కొమ్ముల బాపు, మద్దివేణి చిన్నభీమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ముధోల్: మండలకేంద్రంలోని బస్టాండ్‌లో శుక్రవారం రోడ్డు భద్రత నిబంధనలపై ప్రయాణికులకు ఆర్టీసీ సిబ్బంది అవగాహన కల్పించారు. బస్సుల వివరాలను తెలిపే గమ్యం యాప్‌ను ఉపయోగించే తీరు, ఆర్టీసీ రాయితీపై అందించే సేవలను వివరించారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని.. ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరారు. డయాలసిస్ రోగులు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది కేకే రెడ్డి, వీబీవో భూమేశ్ తదితరులున్నారు.

నిర్మల్‌రూరల్: మండలంలోని రత్నాపూర్‌కాండ్లీ గ్రామంలో శుక్రవారం ఆర్టీసీ అందించే సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విలేజ్ ఆఫీసర్ గంగన్న మాట్లాడారు. ఆర్టీసీ ఇస్తున్న రాయితీలు, శుభకార్యాలు, విహారయాత్రలు, పుణ్యక్షేత్ర దర్శనాల కోసం వెళ్లేవారికి అద్దె ప్రాతిపదికన బస్సులను ఇస్తామన్నారు. శబరిమల వెళ్లే భక్తులకు ఏర్పాట్లు చేస్తామన్నారు. గ్రామంలో 40 మంది విద్యార్థులకు రాయితీ బస్‌పాసులు అందించామని పేర్కొన్నారు. శ్రీనివాస్‌గౌడ్, వీడీసీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామాత ఆలయ వార్షికోత్సవం


కాసిపేట గనిపై పూజలు చేస్తున్న జీఎం మనోహర్, అధికారులు, నాయకులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిపై శుక్రవారం మైసమ్మతల్లి(దుర్గామాత) ఆలయ 22వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతి చండీ హవనము, యజ్ఞం, శాంతిపూజలు నిర్వహించారు. మందమర్రి జీఎం మనోహర్ హాజరై దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేసి హోమంలో పాల్గొన్నారు. కార్మిక కుటుంబాలు ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. అనంతరం కార్మిక కుటుంబాలతో పాటు స్థానికులకు ప్రజాప్రతినిధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే చిన్నయ్య, మాజీ మంత్రి గడ్డం వినోద్, ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, గ్రూప్ ఏజెంట్ రాందాస్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, గని మేనేజర్ అల్లావుద్దీన్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, ఫిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, టీబీజీకేఎస్ ఏరియా నాయకుడు వోడ్నాల రాజన్న, ఫిట్ సెక్రెటరి శంకర్, హోమంలో రక్షణాధికారి సునీల్‌కుమార్, ప్రవీణ్, సోల్లంకి శ్రీనివాస్, మేదరి రాములు, నందయ్య, సత్యనారాయణ దంపతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి


రికార్డులు పరిశీలిస్తున్న అధికారి లక్ష్మణ్

కుంటాల: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని ఎఫ్ఎల్ఎన్ అధికారి లక్ష్మణ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఓల ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. తెలుగు భాషా బోధన, గణితంలో చతుర్విధ ప్రక్రియలో విద్యార్థుల సామర్థ్యం తెలుసుకున్నారు. మోడల్ తరగతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎం శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

‘ఓటరు ప్రలోభాలకు లోనుకావొద్దు’


అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఉపేందర్‌రావు

జైపూర్: ఓటరు ఎలాంటి ప్రలోభాలకు లోనుకావొద్దని జైపూర్ ఎస్సై ఉపేందర్ రావు సూచించారు. బస్టాండ్ ఆవరణలో శుక్రవారం ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ నెల 30న జరిగే సాధారణ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు 200మీటర్ల దూరంలో ఎలాంటి ప్రచారాలు చేయొద్దని పార్టీ జెండాలతో పోలింగ్ కేంద్రాలకు రావొద్దని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా మద్యం, డబ్బులు పంపిణీ చేసినట్లు తెలిస్తే సమాచారం అందించాలని తెలిపారు.

క్లుప్తంగా

బెల్టుషాపులపై దాడులు


స్వాధీనం చేసుకున్న మద్యంతో అధికారులు

దహెగాం: జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్ ఆదేశాలతో మండలంలోని మొట్లగూడలో బెల్టుషాపులపై శుక్రవారం దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. అగిడె శంకర్, నయీం కిరాణ దుకాణాల్లో తనిఖీ చేయగా అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

టీబీజీకేఎస్‌తోనే కార్మిక సమస్యలకు పరిష్కారం


కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న శ్రీనివాస్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): టీబీజీకేఎస్‌తోనే కార్మిక సమస్యల పరిష్కారమవుతాయని బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీని టీబీజీకేఎస్ నాయకులు శుక్రవారం సందర్శించారు. సీహెచ్‌పీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి యూనియన్ కృషి చేస్తుందన్నారు. టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాశ్‌రావు, మాజీ వైస్ ప్రెసిడెంట్ నల్లగొండ సదాశివ్, జీఎం కమిటీ సభ్యులు సమ్మయ్య, ఏరియా నాయకులు సంపత్, వీరస్వామి, ఫిట్ కార్యదర్శి సదానందం, సత్యనారాయణ, శ్యాంబాబు, శ్రీకాంత్, రమేశ్ ఉన్నారు.

పాఠశాలల తనిఖీ


ఉపాధ్యాయుల బోధన పద్ధతులను పరిశీలిస్తున్న హెచ్ఎం విజయ నిర్మల

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని సంజీవనగర్, పెంచికల్‌పేట్ ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం పెంచికల్‌పేట్ కాంప్లెక్స్ హెచ్ఎం విజయనిర్మల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు అనుసరిస్తున్న బోధన పద్ధతులను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థుల ప్రగతి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ పెట్టాలన్నారు. ఆమె వెంట హెచ్ఎం ప్రియాంక, సీఆర్పీ శ్యాంసుందర్ ఉన్నారు.

వనభోజనం



బెజ్జూర్: కార్తీకమాసం పురస్కరించుకొని మండల సమీపంలోని మాణిక దేవార వద్ద దేవాంగ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వన భోజన కార్యక్రమం నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడు బెనికి శ్యాంసుందర్, మండల అధ్యక్షుడు పోలాస శేఖర్, సభ్యులు నాగుల రవికుమార్, రాజమౌళి, గోరంట్ల చంద్రమౌళి, బెగుడ చంద్రమౌళి, మండిగ మహేశ్, మండిగ శంకర్, పొలాస కేదారి, రాపల్లి సమ్మన్న, బెనికి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తులసీ కల్యాణం


కెరమెరిలో తులసీ వివాహం

కెరమెరి: మండల కేంద్రంలోని వివిధ వాడల్లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో తులసీ కల్యాణం నిర్వహించారు. ఇసుకతో తయారుచేసిన శివుడు, గంగ, గౌరీ ప్రతిమలకు పూజలు చేశారు. అనంతరం ఉసిరి, కృష్ణుని ప్రతిమలకు వివాహం చేశారు. కృష్ణునికి పూలు పాలు, పెరుగు, తేనె, పంచదారతో అభిషేకం చేశారు. గ్రామాల్లో మహాశివరాత్రి వరకు తులసీ వివాహం కొనసాగనున్నాయి.

ఆసిఫాబాద్అర్బన్: కార్తీక ద్వాదశిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో పలు కాలనీల్లో తులసీ వివాహాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణుల చిత్రపటాల వద్ద పండితులు వివాహ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ముత్తైదువులకు వాయినాలు, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.